

# ప్రపంచం

వాడ్రేవు చిన వీరభద్రుడు

## పరాయి ప్రపంచం

చిట్టిగాడు షావుకారు ఇంట్లో పాలబుగ్గల జీతగాడు. పది పదకొండేళ్ళవాడు. అయ్యా అమ్మా కూలి పనికి పోతారు. అక్కనుమరో కూలి సంబంధానికి దూర దేశమిచ్చి చాలా కాలమే అయ్యింది. చంటి ముండ ఒక చెల్లెలుంది. దాన్ని అమ్మ చంకనెత్తుకునే పనికి పోతుంది.

చిట్టిగాడికి తిండీ పడకా అన్నీ షావుకారు ఇంట్లోనే. ఇల్లు వూడుస్తాడు. అంగట్లో అమ్మ కాలు చూస్తాడు. గొడ్లసాలలో కసవు పోగుచేస్తాడు. చదువు చక్కగా సాగి వుంటే చిట్టిగాడు పెద్ద స్కూలులో చదువుకుంటూ వుండాల్సిన వాడు కాని షావుకారు పని చూపించాడు. అయ్య చదువు మాన్పించాడు. చిట్టిగాడు చదువు మాని పనికి కుదిరాడు.

ఆవాళా చిట్టిగాడికి ఎప్పటిలానే తెల్లారింది. అంటే తూర్పు తెల్లారకుండానే షావుకారమ్మ కేకల్తో, విడీ విడనికళ్ళని చన్నీళ్ళతో కడుక్కుని, కునుకుతూనే ఇల్లు వూడ్చాడు. దుకాణంలో దుమ్ము తుడిచాడు... ఇంకా చిన్నవీ పెద్దవీ ఎన్నో పనులు, అలా పనుల మధ్యనే సూర్యుడు ఆకాశ మధ్యానికి వచ్చాడు. కడుపులో ఆకలి గుర్రు గుర్రు మంటున్నది. పొద్దుటి చద్ది ఏ మూలకీ చాలదు. ఆవులింతల్తోను, అలసిన కళ్ళకి అడ్డు పడుతున్న మసకల్తోను షావుకారమ్మ పిలుపు కోసం చూస్తూ అలవాటుగా పని కొనసాగిస్తున్నాడు.

అప్పుడేం జరిగిందంటే, పెద్ద జరగకూడ నిదేం కాదు. ఆకలి కొద్దీనో ఆశ కొద్దీనో గుప్పెడు శెనగపప్పు వేపిన పప్పు నోట్లో పోసుకున్నాడు. చిట్టిగాడి చిట్టి చేతుల గుప్పెటలో పట్టే పప్పు ఏ మాత్రమని? అయినా అది షావుకారమ్మ కళ్ళలో పడనే పడింది. ఆమె కది ఎందుకు కోపం తెచ్చిందో ఎవరికి తెలుసు? ఆమెకీ తెలీదేమో. అయినా కోపం పట్టలేక అరచింది "ఓరి దొంగ యెధవా ఇలా పప్పకుప్ప నోట్లోస్తుంటే ఇంక అమ్మడానికేటి మిగుల్తాదిరా? పప్పు బుక్కేస్తున్న దరిద్రుడివి చిల్లర కూడా బుక్కేస్తావు జాగర్త పడకపోతే" వాణ్ణి రెండు చేతుల్తోనూ దబా దబా బాదింది. వాడి పట్ల పెట్టుకున్న నమ్మకాన్ని వాడు నిలుపుకోలేదని మొత్తుకుంది. దేన్ని క్షమించినా నమ్మక ద్రోహాన్ని క్షమించకూడదన్నదే షావుకారమ్మ సూత్రం. అందుకని వాణ్ణి ఆ పట్టానే బయటకు తరిమేసింది.

అర్థం చేసుకోలేని శిక్షకు నెత్తురుడిగిన ముఖం, వాడిన బుగ్గలూ, నీళ్ళు చిప్పిల్లే లేత కళ్ళా- చిట్టిగాడు వీధిన పడ్డాడు. కడుపులో ఆకలి రంపపు కోత. గొంతులో ఏమేమో అడ్డుపడుతున్నాయి. ఊపిరి బిగపట్టుతూంది. రోజూ అలవాటుగా పొట్లాలు కడుతూండగానే ఇంటి కప్పు మీంచి

19-4-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

> పైపైగా చూస్తే ఈ ప్రపంచం మనందరిదీ అనిపిస్తుంది కానీ, అది నిజమా? ఆకలేసినప్పుడు ఎదురుగా కని పిస్తున్న పదార్థం నుంచి గుప్పెడు తీసుకోవ డానికి వీల్లేనప్పుడు, యీ ప్రపంచ మంతా వాడిదేనంటే వాడు నమ్ముతాడా!
>
> రోజూ చూస్తున్న యీ ప్రపంచం తనది కాదనీ, తనకేమీ ఇవ్వదనీ ఏదో సందర్భంలో తెలిసి పోయినట్టే, అందరిలా కనిపిస్తున్న యీ ప్రపంచంలో తన ప్రపంచమేదో తెలిసే సందర్భమూ వుంటుంది. వ్యక్తుల జ్ఞానం కన్నా, అనుభవజ్ఞానమే ఆ సంగతిని తెలియ జేస్తుందేమో! అంతవరకూ ఏ ప్రపంచ మేవ రిదో తెలీదు కనుక, అందరిదీ ఒకే ప్రపంచం అనుకుంటుంటాం.

ఏటవాలుగా జారిపోయే నడి మధ్యాహ్నం ఇప్పుడు సరాసరి వాడి నెత్తిమీంచే జారుతోంది. చమురు లేని జుత్తు. పైనా కిందా మంటలు.

గమ్యం లేకుండా అట్లా వాడు వూరంతా తిరి గాడు. ఇంటికెళ్ళాడు. ఇల్లంటే ఇల్లు కాదు, నిట్టాతి గుడిసె. తలుపు గొళ్ళెం పెట్టి అమ్మా, అయ్యా కూలికి పొయ్యారు. వాడట్లా ఇంటి గడప ముందే దిక్కు తోచకకాసేపు నిలబడ్డాడు. ఆనక ఇంటి ఎదుట చుట్టలు చుట్టుకున్న మామిడి చెట్టు వేళ్ళ మొదళ్ళపైన నీరసంగా వాలాడు. కొమ్మల గుబుర్లలో పిట్టలు గోల చేస్తు న్నాయి. ఎక్కువ సేపు కూర్చోలేక లేచి కది లాడు. చెరువు పక్కగా మట్టి బాట వెంబడే నీలాటి రేవు దాకా నడిచాడు. అటు పక్క నాలుగడుగులుకుడివేపు తిరిగితే బడి. బళ్ళో పంతులమ్మ వుండీ వుండీ పిల్లలమీద విరుచుకు పడుతోంది. బడిఆవరణలో పూల మొక్కల మీదా, ఆకుల జొంపాల మీదా ఎండ మెరుస్తోంది. నోటికి తాళాలేసుకుని బళ్ళో పిల్లలు చిట్టిగాడిని చూస్తున్నారు.

బడి పక్కగా రెడ్డి గారి మామిడి తోట వైపుగా నడుస్తో మంచినీటి బావిదాకా వెళ్ళాడు చిట్టి గాడు. ఎండలో బావి నీళ్ళు సవ్వడి చెయ్యకుండా అణిగి మణిగి మెరుస్తున్నాయి. ఒంటరి కాకి ఒకటి నూతిగట్టు మీదవాలి ఆ పైన కావుకావు మంటూ ఎగిరిపోయింది. అక్కణ్నుంచి కదిలి చిట్టిగాడు రాజుగారి గొడ్లసాలల మీదుగా కోవెల దిక్కుగా నడిచాడు. కుమ్మరాళ్ళ సందులో గోళీ లాడుతోంటే ఆగి చూడబోయాడు. ముందు వాణ్ణే పట్టించుకోని అల్లరి పిల్లలు ఆ తర్వాత కసిరి తరిమేశారు.

ఎర్రగడ్డలూ, సెనక్కాయలూ గంపలో పెట్టుకుని ఇల్లిల్లూ అమ్ముకునే ముసిలి మంగమ్మ వాడికి ఎదుట పడింది. ఏదన్నా తినడానికి పెడు తుందేమో అని ఆశపడ్డాడు. కాని అడగడానికి మొహమాట పడ్డాడు. ఒడిలిపోయిన అరికాళ్ళలో ఓపికలేని ముసిల్ది చిట్టిగాడ్ని చూడకుండానే తొందర తొందరగా నడిచిపోయింది.

తిరిగి తిరిగి మళ్ళీ షావుకారు ఇంట ముంగి టికే.చేరాడు చిట్టిగాడు. లోపల భోంచెయ్యడాని కని వీధి తలుపులు మూసి వెళ్ళిపోయి వుంది షావుకారమ్మ. ఎండలో బయట కిరస నూనె డబ్బా వాసన కొడుతున్నాయి. వాడు ఆ చమురు గాలిలోనే ఆ ఇంటి గోడవార నీడలో కాళ్ళు చాపుకు కూచున్నాడు. ఎదుట పశువుల పాకలో లేత గేదె పెయ్యకాలికి పలుపుతాడుతో క్రొరు పక్కనే కనులరమోడ్చి పడుకుంది. దాని చుట్టూ పేడలో తడిసిన ఎండు గడ్డి. ఎదుట గోలెంలో తవుడు వాసన కొట్టే కుడితి సగం దాకా. పసుపు పచ్చని గోడ వెల్ల వాడి వీపునీ మోచేతుల్నీ అంటు కుంది. దాన్ని తుడుచుకోకుండానే నీర సంగా కళ్ళు మూసుకున్నాడు. మరి కాసేపట్లోనే చిట్టిగాడూ, వాడి ఆకలీ నిద్రలో కరిగి పొయ్యాయి.

తనని ఎవరో లేపుతోంటే చిట్టిగాడు ఉలిక్కి పడి అలసటగా కళ్ళు తెరిచాడు. షావుకారమ్మ నడి మధ్యాహ్నం ఎప్పుడో జారిపోయి సాయం కాలపు ఎండ బెంగగా తీగలు సాగుతోంది. ''లేచి, ముఖం కడుక్కో. టీ తాగి కొట్లో కూచుందువు గాని, లే, లే'' షావుకారమ్మ అదిలించుకుంటూ పోయింది. లాగు పైకి లాక్కుంటూ లేచాడు చిట్టిగాడు. అంతదాకా వాడి పక్కనే ముడుచు కున్న ఓ మేకపిల్ల కూడ వాడితో పాటేలేచింది.

ఆ ముఖంతో అట్లానే చిట్టిగాడు మళ్ళీఆ కొట్లో అడుగు పెట్టాడు.

## సొంత ప్రపంచం

నాకోసం వచ్చాడు ఆ వేళ రాజేంద్ర. అందరికీ దూరంగా ఒంటరిగా ఈ పట్టణంలో .చిన్నపాటి నౌకరీ చేస్తున్న నన్ను వెతుక్కుంటూ వచ్చే ఆప్తులు అరుదయిపోయిన కాలంలో హఠాత్తుగా వ చ్చాడతను. నాకు అతిథిగా, అతను నా బంధువు. పట్నంలో నాలుగయిదు రోజులు వుండాల్సిన పని మీద వచ్చాడు. ఏదో ఒక మంచి హోటల్లో బస చేసేవాడే, కానీ నేనుబలవంత పెట్టి నాతో పాటు ఉండిపొమ్మన్నాను.

ఆవాళ సాయంత్రం అంటే అతను మా ఆఫీసు కొచ్చి నన్ను ఆశ్చర్యపరిచిననాడే అతన్ని పట్నం రోడ్లమ్మట తిప్పేసాను. అంతకు మించి ఏం చెయ్యగలను? నాకు పట్నంలో ఎవరూ లేరు, ఎవరూ తెలీదు. ఆ రోడ్ల మీద మనుష్యుల మధ్యఒంటరిగానే మసిలేవాణ్ణి. మా ఆఫీసులో నా పని గురించే చాలా సేపు మాట్లాడేను. సినిమాల గురించి కూడా మాట్లడుకున్నామేమో. దేశంలో వార్తల గురించి చెప్పకోబోయాం. కానీ చుట్టు ప్రక్కల వాళ్ళు కూడా కల్పించుకోవడంతో ఆపేసాం. నా రూం అంత బాగుండేది కాదు. అయినా ఇష్టంగా తీసుకెళ్ళి చూపించాను. నీళ్ళూ, సబ్బూ, తువ్వాలూ ఇచ్చి మొహం కడు క్కోమన్నాను. అద్దం, దువ్వెనా, ఫేసు పౌడరూ... మర్యాద చెయ్యటంలో తృప్తి వుంది కదూ. నా దగ్గరఎక్కువ డబ్బులుండేవి కావు. అయినా అతనికోసం ఖర్చు పెట్టడానికి వెనుకాడ కూడదనుకున్నాను.

ఆ తర్వాత నేనురోజూ వెళ్ళే మునిసిపల్ పార్కుకి తీసుకెళ్లాను. అక్కడ నేను కూర్చునే చోటూ, వెర్రిగా పూసిన పసుపు పచ్చ పూల చెట్టూ చిరుతిళ్ళు అమ్మేవాళ్ళు, మెర్క్యురీ దీపాల స్తంభాలూ వుండే నాదయిన విశ్రాంతి ప్రపంచంలోకి అతన్ని ప్రవేశపెట్టాను. కాసేపు పార్కు రేడియో విన్నాం. ''ఇవాళ మనం మంచి భోజనం చేసి చక్కని సినిమాకి వెళ్దాం'' అన్నాడు అతను. నేను అతన్ని నా ఖాతా హోటల్‌కి తీసుకెళ్ళాను. ''ఇదే మాఘనత వహించిన భోజ నాలయం, లోపలికి దయచేసి పావనం చెయ్యి'' అన్నాను, నేనుసినిమాల్లో చూసిన పెద్ద పెద్ద హోటళ్ళలో వెయిటర్లని అనుకరిస్తూ, అక్కడ కౌంటర్లో ఎప్పుడూ రాతి మొహంతో కూచునే నంబియార్ని కూడా పరిచయం చేద్దామను కున్నాను. అలాగ ఎందుకు అనిపించిందో తెలీదు. అలాగే అది వీలూ కాలేదు. ఎందుకంటే నంబి యారుకీ నాకు ముఖాలే గుర్తు తప్ప మాటల పరిచయమేమీ లేదు.

భోజనాల బల్ల దగ్గర కూచుంటున్నపుడు రాజేంద్ర నా మొహంలోకి చూసినచూపు నాకు ఇంకా గుర్తుంది. అందులో జాలి, సానుభూతి,

ప్రతిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

అసహ్యం - ఏం పలికాయో చెప్పలేను గానీ నా ఆత్మీయుడి మొహం అప్పుడు కనిపించినంత పరాయిగా ఎప్పుడూ కనిపించలేదు నాకు. నేను చేసిన పొరపాటు ఏమిటో నాకు తర్వాత గానీ అర్థం కాలేదు. కానీ ఏం చెయ్యను? నాకు అంతకన్నా ఖరీదయిన హోటళ్ళకి తీసుకు వెళ్ళ గలిగే స్తోమత లేదు. వాడు పొద్దుటి కూర, పులిసిన పప్పూ పెట్టాడే అనుకోండి. ఆ గదంతా ముక్క వాసనతో, బల్లల అంచులు ఉండలు కట్టిన ఎంగిళ్ళతో, నేల ముర్గ్గా తేమగా వున్న మాట నిజమే. కాని అదేమీ నాకువెబ్బెట్టుగా అనిపించలేదు. నేను రోజూ జీవిస్తున్న జీవితమే అది. దాన్ని అసహ్యించుకోవాలని నా కెప్పుడూ అన్పించలేదు.

రాజేంద్ర అందంగా వుంటాడు, అందంగా నవ్వుతాడు. ఆరోగ్యవంతుడైన మనిషి. అతని ఉనికి నాకు చాలా ఇష్టం. కానీ అవాళ ఆ ఆడమనిషి మా భోజనాల బల్ల ఎదురుగా కూచున్నపుడు మాత్రం అతని మొహం వికృతంగా జేవురించింది. పురుగు మీద పడ్డట్టు అతనిఒళ్లు జలదరించింది. "అటు చూడు, అటుచూడు" అన్నాడు నా చెవిలో భయంగా, అసహ్యంగా, కోపంగా ఒణికిపోతూ. అటు చూసాను. రేగిన జుత్తు, పుసులుకట్టిన కళ్ళు, చిరుగుల రవికె, ఓణీ, సత్తు జూకాలు. అవి ఎంత అడ్డుపడుతున్నా దాగని యవ్వన కళ. "ఏం"? అన్నాను. "ఏమేమిటి? ఎవరో బజారు ముండ, మీ హోటలు వాడు లేబరు క్లాసు మెస్సు నడుపుతున్నాడు. ఛ, నువ్వు ఇందులో తినడమేంటి?" అన్నాడు. నేను విని తేరుకునేలోగానే అతడు సగంలో చేతులు కడిగేసుకుని ఆ పిల్లని కోపంగా చూస్తూ వెళ్ళిపోయేడు. కానీ ఒకింత ఆశ్చర్యపోయాను. ఆ కళ్ళలో, మొహంలో ఏదో పరిచితమైన ఆధారం కన్పించింది. ఆమెనిఇంతకు ముందు ఎక్కడన్నా చూశానా? ఆవాళ మేం చూసిన సినిమా, అందులో హీరో, హాల్లో కుర్చీలూ అన్నీ రాజేంద్రని మరీ చికాకు పర్చినట్టున్నాయి. మరింత బిగుసుకుపోయాడు. ఉదయాన్నే నన్ను జాలిగా చూసి "హోటలు మార్చేసుకో. రోడ్లమ్మట తిరగకు, ఆరోగ్యం జాగ్రత్త" అన్నాడు. ఆ సాయంకాలమే పని పూర్తి చేసుకొని వెళ్ళిపోయాడు.

ఆ సాయంకాలమంతా నాకు భారంగానూ, శూన్యంగానూ వుంది. వచ్చిన అతిథిని సంతోషపెట్టలేకపోయాను. అతనికి క్షమాపణకోరుతూ ఉత్తరం రాయాలనుకున్నాను. కానీ మాటలు రాక విరమించాను. ఎప్పుడయినా పెళ్ళయిన తర్వాత (నా భార్య నా జీవితంలోకి సిరినీ, సౌభాగ్యాన్నీ తెస్తుందన్న నమ్మకం వుంది కాబోలు) అతన్ని నా ఇంటికి పిలిచి నెల రోజులు అతిథిగా వుంచుకోవాలని తీర్మానించాను. మళ్ళీ అదే పార్కులో అదే పసుపు పచ్చ పూల చెట్టుకింద గడిపి ఆ నంబియార్ నీడకే చేరాను. రాజేంద్ర మంచి భోజనం మంచి సినిమా కావాలనుకొని దొరక్క వెళ్ళిపోయాడు. అన్యమనస్కంగానూ, దిగులుతోనూ కూచున్న నా ముందు మళ్ళీ ఆ పిల్ల. ఈసారి ఆ పిల్లను గుర్తుపట్టగలిగాను. ఆమె బహుశా నాకు ఎక్కడో దూరపు బంధువు అయి వుండాలనిపించి - అంత దిగుల్లోనూ హాయిగా ఫీలవకుండా వుండలేకపోయాను.

# చిక్కుముడి-11

— పాపినేని శివశంకర్

### ఆధారాలు

అడ్డం

1. ఉన్నవ లక్ష్మీనారాయణ నవల (4)
5. అబద్ధం (2)
6. తెల్లని పువ్వు (2)
7. 'విలాస భవనం'లో సమావేశం! (2)
9. కోతి స్పెషాలిటీ! (2)
10. 'నా-వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' (4)

నిలువు

2. 'కర్పూర వసంతరాయలు' కావ్య నాయిక (3)
3. 'కడుపులో-కదలకుండా (2)
4. ఇలా తలుపు కొట్టండి! (4)
5. 'ఉప్పు-ఒక్క పోలిక నుందు' (4)
8. సెబాస్! (3)
9. ఉద్యానవనం (2)

